

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 11-10-2026 | సంపుటి - 31 | సంచిక - 139 | రూ : 4 | పేజీలు: 8



రాబోయే 8 నెలలు కీలకం

- విద్యుత్ కొందామన్నా లేదు.. పొదుపుగా వాడుకోవాలి
- 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు
- నీటి సమస్య తీవ్రం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోండి
- ఎల్‌నినోపై వార్‌రూం, టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలి
- జీరాంజీలో 50 రోజుల పని దినాలు పెంచాలని కేంద్రాన్ని కోరాలి
- ఎల్‌నినో ప్రభావంపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

రేడియల్ రోడ్-2 టెండర్ల కుంభకోణంపై

సీఎం సమాధానం చెప్పాలి

- పనులను కేటాయించిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి.. కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్: రేడియల్ రోడ్2 టెండర్ల వ్యవహారంలో జరిగిన కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ రహదారిని రూ.3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నారని, బుద్వేల్ నుంచి కొడంగల్ సమీప జాతీయ రహదారి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి చేపట్టిన టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ''ఈ టెండర్లలో తక్కువ ధరకు బిడ్‌లు దాఖలు చేసిన సంస్థను పక్కనపెట్టి, ఎక్కువ ధరలకు కోట్ చేసిన వారికి పనులను కేటాయించడంపై సమగ్ర విచారణ చేయించాలి. కేవలం ఐదు పని దినాల్లోనే రూ.3,296 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, కేటాయింపుల ప్రక్రియను ఎలా పూర్తి చేశారు, ఏ ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్‌లు వేస్తే ఎన్ని అర్హత సాధించాయి, ఏ సంస్థ ఎంత ధర కోట్ చేసింది, తుది కేటాయింపు ఎంతనే వివరాలను వెల్లడించాలి. మూడు ప్యాకేజీల్లో బిడ్డర్ల అర్హతల నిర్ధారణకు ఒకేవిధమైన ప్రమాణాలను అనుసరించారా లేదా అనే విషయాలతో సహా మొత్తం టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి.



తరువాయి 2లో

పనామాను వణికించిన భారీ భూకంపం..

7.6గా తీవ్రత నమోదు

- పలు భవనాలకు నష్టం, కూలిన చర్చి టవర్
- పసిఫిక్ తీర దేశాలకు మొదట సునామీ హెచ్చరికల జారీ
- ప్రమాదం తప్పిందంటూ తర్వాత హెచ్చరికల ఎత్తివేత
- ప్రజలు ప్రశాంతంగా ఉండాలని అధ్యక్షుడి పిలుపు

2లో



ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..

సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు



ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం

తరువాయి 2లో

సౌదీపై మరోసారి దాడి..

రియాద్ ఎయిర్‌పోర్ట్ మూసివేత

- సౌదీ రాజధాని రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై మరోసారి దాడి
- విమానాశ్రయం ఖాళీ, నిలిచిపోయిన విమాన సర్వీసులు
- ఇటీవలి దాడుల్లో పైలట్‌తో సహా పలువురి మృతి
- హౌతీ తిరుగుబాటుదారుల పనేనని అనుమానాలు
- దాడులపై స్పందించిన ట్రంప్.. ఇది మంచిది కాదంటూ వ్యాఖ్య



సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై మరోసారి దాడి జరిగింది. శనివారం జరిగిన ఈ దాడితో అధికారులు ఎయిర్‌పోర్ట్‌ను ఖాళీ చేయించి, విమాన రాకపోకలను నిలిపివేశారు. రెండు రోజుల క్రితం జరిగిన దాడిలో పైలట్‌తో సహా ముగ్గురు సౌదీ పౌరులు మరణించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర

తరువాయి 2లో

హైదరాబాద్ హైస్పీడ్ రైల్..

భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి




హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది

తరువాయి 2లో

భారత్‌కు ఆంక్షలు..

అమెరికాకు మినహాయింపా?

- రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు ట్రంప్ అంగీకారం
- రష్యా డీజిల్ లావాదేవీలపై ఆంక్షలను సడలించిన అమెరికా
- భారత్‌పై సుంకాల వైఖరిని గుర్తుచేస్తూ అమెరికాలో విమర్శలు
- రష్యాకు ఆదాయం పెరుగుతుందని అమెరికా సెనేటర్ల అభ్యంతరం
- ఇంధన ధరలు తగ్గించేందుకే ఈ నిర్ణయమని ట్రంప్ సమర్థన



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై సుంకాల విషయంలో ఒత్తిడి తెచ్చిన అమెరికా.. ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ తెప్పించుకోవడానికి సిద్ధమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలోనే విమర్శలకు దారితీసింది. భారత్ విషయంలో ఒకలా, తన విషయంలో

తరువాయి 2లో

జింబాబ్వేలో యూపీఐ

భారత్‌తో చర్చలు

- ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థను మార్చేందుకు జింబాబ్వే ప్రయత్నాలు
- భారత యూపీఐ టెక్నాలజీ కోసం ఎన్‌పీసీఐతో చర్చలు
- తక్కువ ఖర్చుతో వేగవంతమైన లావాదేవీలే ప్రధాన లక్ష్యం
- అక్టోబర్ 31 నాటికి ఒప్పందం ఖరారయ్యే అవకాశం
- ఇప్పటికే పలు ఆఫ్రికా దేశాలు యూపీఐపై ఆసక్తి

2లో

UPI
UNIFIED PAYMENTS INTERFACE

రేడియల్ రోడ్-2 టెండర్ల కుంభకోణంపై సీఎం సమాధానం చెప్పాలి

హైదరాబాద్: రేడియల్ రోడ్ 2 టెండర్ల వ్యవహారంలో జరిగిన కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ రహదారిని రూ.3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నారని, బుద్వేల్ నుంచి కొడంగల్ సమీప జాతీయ రహదారి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి చేపట్టిన టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ''ఈ టెండర్లలో తక్కువ ధరకు బిడ్‌లు దాఖలు చేసిన సంస్థను పక్కనపెట్టి, ఎక్కువ ధరలకు కోట్ చేసిన వారికి పనులను కేటాయించడంపై సమగ్ర విచారణ చేయించాలి. కేవలం ఐదు పని దినాల్లోనే రూ.3,296 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్ల పరిశీలన, అర్హతల నిర్ధారణ, కేటాయింపుల ప్రక్రియను ఎలా పూర్తి చేశారు, ఏ ప్యాకేజీకి ఎన్ని సంస్థలు బిడ్‌లు వేస్తే ఎన్ని అర్హత సాధించాయి, ఏ సంస్థ ఎంత ధర కోట్ చేసింది, తుది కేటాయింపు ఎంతనే వివరాలను వెల్లడించాలి. మూడు ప్యాకేజీల్లో బిడ్డర్ల అర్హతల నిర్ధారణకు ఒకేవిధమైన ప్రమాణాలను అనుసరించారా లేదా అనే విషయాలతో సహా మొత్తం టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి. సాంకేతిక అర్హతలపై తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను విడుదల చేయాలి. ప్రజాధనంపై ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలి. పనులను విభజించి, ముందుగా నిర్ణయించుకున్న సంస్థలకే కట్టబెట్టారనే అనుమానాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే. మూడు ప్యాకేజీల్లో కలిపి రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణపై విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలి. రేడియల్ రోడ్ 2 టెండర్లను తక్షణమే రద్దు చేయాలి. గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపట్టిన రూ.100 కోట్లకుపైబడిన ప్రాజెక్టులకు సంబంధించిన గుత్తేదారులపై కాగ్ ఆడిట్ నిర్వహించాలి'' అని ఆ లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు.

సౌదీపై మరోసారి దాడి.. రియాద్ ఎయిర్‌పోర్ట్ మూసివేత

సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై మరోసారి దాడి జరిగింది. శనివారం జరిగిన ఈ దాడితో అధికారులు ఎయిర్‌పోర్ట్‌ను ఖాళీ చేయించి, విమాన రాకపోకలను నిలిపివేశారు. రెండు రోజుల క్రితం జరిగిన దాడిలో పైలట్‌తోసహా ముగ్గురు సౌదీ పౌరులు మరణించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. విమానాశ్రయానికి విమానాల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయని ఇద్దరు ప్రాంతీయ అధికారులు మీడియాకు తెలిపారు. రాజధానిలో కనీసం రెండు భారీ పేలుళ్లు వినిపించాయని రియాద్ నివాసి అహ్మద్ సయ్యద్ ఏపీ వార్తా సంస్థకు చెప్పారు. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. పొరుగున ఉన్న యెమెన్‌లో ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులపై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం భారీ సైనిక చర్య ప్రారంభించినప్పటి నుంచి ఈ విమానాశ్రయంపై పలుమార్లు దాడులు జరిగాయి. బుధవారం జరిగిన దాడికి తామే బాధ్యులమని హౌతీలు ప్రకటించారు. ఆ దాడిలో ఒక సూడాన్ జాతీయుడు మరణించాడు. అయితే శనివారం నాటి దాడిపై హౌతీల నుంచి తక్షణ ప్రకటన ఏదీ రాలేదు. యెమెన్‌లో సౌదీ మద్దతున్న ప్రభుత్వ బలగాలకు, హౌతీలకు మధ్య పోరాటం తీవ్రమైంది. ఎర్ర సముద్రం వెంట హౌతీలు పట్టు సాధించడంతో, కీలకమైన నౌకాయాన మార్గాలపై నిఘా పెంచారు. రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై దాడుల గురించి శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, "ఇది మంచిది కాదు. నేను సంతోషంగా లేను" అని వ్యాఖ్యానించారు. అయితే, దాడులను తిప్పికొట్టేందుకు అమెరికా నుంచి తక్షణ సైనిక మద్దతు లభించే సూచనలు కనిపించడం లేదు.

పనామాను వణికించిన భారీ భూకంపం.. 7.6గా తీవ్రత నమోదు

పనామాలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. దేశ దక్షిణ తీర ప్రాంతంలో 7.6 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం చోటు చేసుకుంది. ఈ ఘటనతో అధికారులు వెంటనే పసిఫిక్ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, తర్వాత ప్రమాదం తప్పిందని నిర్ధారించి వాటిని ఉపసంహరించుకున్నారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జిఎస్) ప్రకారం, భూకంప కేంద్రం పిటలోజా అరిబా సమీపంలో, భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. భూకంప తీవ్రతను తొలుత 8.0గా అంచనా వేసినప్పటికీ, తర్వాత 7.6కు సవరించారు. ఈ భూకంపం ధాటికి రాజధాని పనామా నగరంతో పాటు పొరుగున ఉన్న కోస్టారికా రాజధానిలోనూ భవనాలు తీవ్రంగా కంపించాయి. భయంతో ప్రజలు ఇళ్ల నుంచి, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. పెనోనోమే నగరంలోని ఒక కేథడ్రల్ టవర్ కూలిపోయిందని, మరికొన్ని నిర్మాణాలకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భూకంపం సంభవించిన వెంటనే, యూఎస్ సునామీ వార్నింగ్ సిస్టమ్ పనామా, కొలంబియా, ఈక్వడార్ సహా మధ్య అమెరికా పసిఫిక్ తీరాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని చోట్ల 1 నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగసిపడవచ్చని అంచనా వేసింది. అయితే, కొంతసేపటి తర్వాత పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ పరిస్థితిని సమీక్షించి, పెద్ద ప్రమాదం ఏమీ లేదని ప్రకటించింది. దీంతో సునామీ హెచ్చరికలను ఎత్తివేశారు. ప్రధాన భూకంపం తర్వాత 6.6 తీవ్రతతో సహా పలుమార్లు భూమి కంపించింది. ఈ ఘటనలో ప్రాణనష్టంపై వెంటనే స్పష్టత రాలేదని, కొందరికి స్వల్ప గాయాలైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. పనామా అధ్యక్షుడు జోస్ రాఉల్ ములినో ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. పనామా కెనాల్ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అధికారులు నష్టం అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

రాబోయే 8 నెలలు కీలకం

హైదరాబాద్: ''ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రానున్న ఎనిమిది నెలలు అత్యంత కీలకం. ఈ దిశగా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, దాని అమలులో ప్రజలనూ భాగస్వాములను చేయాలి'' అని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముమ్ముందు విద్యుత్ సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని, రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో అందుబాటులో లేదన్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై తన నివాసంలో శనివారం ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. తాగు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్పష్టంచేశారు. ''ఎల్‌నినోతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్నాయి. రానున్న ముప్పును ముందుగా గుర్తించకుంటే భవిష్యత్‌లో తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు తక్షణమే చేపట్టాలి. లోటు వర్షపాతం, దాని పర్యవసానాలపై సినిమా, మీడియా, కళాజాతలతోపాటు అన్నిరకాల మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. దసరా అనంతరం గ్రామం నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోండి.

*** కేంద్రాన్ని రూ.20 వేల కోట్ల ప్రత్యేక సాయం కోరాం**

రైతులు సాగు చేసిన పంటల పరిస్థితులను అంచనావేసి అవి చేతికొచ్చే వరకు నీటికొరత లేకుండా చూడండి. ఒక్క చుక్క నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాష్ట్రంలో 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరవు మండలాల ప్రకటనతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విన్నవించింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. జీరాంజీ పథకంలో భాగంగా 125 రోజులకు అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలి. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చిస్తాం.

బీసీ రిజర్వేషన్లు ఖరారు: ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

*** ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్**

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) చైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.

మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది. ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 202627 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

భారత్‌కు ఆంక్షలు.. అమెరికాకు మినహాయింపా?

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై సుంకాల విషయంలో ఒత్తిడి తెచ్చిన అమెరికా.. ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ తెప్పించుకోవడానికి సిద్ధమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలోనే విమర్శలకు దారితీసింది. భారత్ విషయంలో ఒకలా, తన విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారంటూ రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రశ్నిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అమెరికా, ప్రపంచ మార్కెట్లకు భారీ మొత్తంలో డీజిల్ సరఫరా చేసేందుకు అంగీకరించారని ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో రష్యా డీజిల్ లావాదేవీలపై కొన్ని ఆంక్షలను అమెరికా ఆర్థిక శాఖ తాత్కాలికంగా సడలించింది. అయితే, రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు వీలు కల్పించే చట్టంపై ట్రంప్ సంతకం చేసిన కొన్ని వారాలకే ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

అమెరికాపై సొంత దేశంలోనే విమర్శలు

అమెరికా జర్నలిస్టు క్యాథరిన్ రాంపెల్ ఈ నిర్ణయంలోని వైరుధ్యాన్ని ప్రశ్నించారు. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా తనపైనా సుంకాలు విధించుకుంటుందా? అంటూ 'ఎక్స్'లో ప్రశ్నించారు. రాజకీయ జర్నలిస్టు సామ్ స్టెయిన్ కూడా ట్రంప్ వైఖరిని ప్రస్తావించారు. రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు ఉద్దేశించిన ఆంక్షల చట్టంపై ఇటీవలే సంతకం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు అదే దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నించారు. సోషల్ మీడియాలోనూ ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. రష్యా చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ నిధులు సమకూరుస్తోందని గతంలో అమెరికా విమర్శించిందని పలువురు గుర్తుచేస్తున్నారు. మరి రష్యా నుంచి అమెరికా ఇంధనం కొనుగోలు చేస్తే అదే సూత్రం వర్తించదా? అని ప్రశ్నిస్తున్నారు.

అమెరికా సెనేటర్ల అభ్యంతరం

రష్యా డీజిల్ విక్రయాలకు ఆరు నెలలపాటు అనుమతించడాన్ని డెమోక్రటిక్ పార్టీ సెనేటర్లు జీన్ షహీన్, చక్ షుమర్, ఎలిజబెత్ వారెన్ తప్పుబట్టారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఆదాయాన్ని పెంచుతుందని, మాస్కోపై ఒత్తిడి తగ్గుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా చమురు రవాణా నౌకలు, ఆర్థిక వ్యవస్థలు, సైనిక సాంకేతికత సరఫరాదారులపై కఠిన ఆంక్షలు అమలు చేయాలని గతంలోనూ అమెరికా చట్టసభ సభ్యులు కోరారు.

ధరలు తగ్గించేందుకే: ట్రంప్

అమెరికాలో ఇంధన ధరలను తగ్గించేందుకే రష్యా నుంచి అదనపు డీజిల్ తెప్పించుకుంటున్నామని ట్రంప్ సమర్థించుకున్నారు. వినియోగదారులు, రైతులు, ట్రక్కుల యజమానులకు ఇంధనం అందుబాటులో ఉండాలంటే ఈ సరఫరాలు అవసరమని చెప్పారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. రష్యా తొలుత 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ సరఫరా చేయనుంది. నవంబరులో 5 లక్షల టన్నులు, ఆ తర్వాత 10 లక్షల టన్నులు అందించనుంది. తదుపరి సరఫరాలు రిఫైనరీల సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. రష్యా నుంచి వచ్చే డీజిల్‌కు సంబంధించి నిర్దిష్ట లావాదేవీలను 2027 ఏప్రిల్ వరకు అనుమతిస్తూ అమెరికా ఆర్థిక శాఖ జనరల్ లైసెన్స్ 135 జారీ చేసింది. మరోవైపు, రష్యాకు అదనపు ఇంధన ఆదాయం అందించడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం పెరుగుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు.

ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ.. భారత్‌తో జింబాబ్వే చర్చలు

భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సాంకేతికత అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది. తాజాగా ఆఫ్రికా దేశమైన జింబాబ్వే తమ దేశ చెల్లింపుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు యూపీఐ సాంకేతికతను వినియోగించుకోవడంపై భారత్‌తో చర్చలు జరుపుతోంది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్)తో జింబాబ్వే సంప్రదింపులు జరుపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, జింబాబ్వేలోని బ్యాంకులు, మొబైల్ మనీ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి రియల్ టైమ్ చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల లావాదేవీల వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, నగదు బదిలీల వేగం కూడా పెరుగుతుందని జింబాబ్వే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ జాన్ ముషయవాస్తు ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న మొత్తాల దేశీయ లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా ఇది నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): తెలంగాణ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తొలిరోజు వేడుకలు ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ పండుగలో భాగంగా తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఉదయం నుంచే మహిళలు తంగేడు, గునుగు తదితర రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చారు.అనంతరం మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఎల్లంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ లౌడియా శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన పండుగను మహిళలంతా ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మున్సిపల్ పరిధి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విజయదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



జనగామ,ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భం గా ఆలయంలో ప్రత్యేక పూజలు,ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నా రు. ఆలయ ప్రధాన అర్చకులు రాజలిం గ ఆరాధ్య శర్మ ఆధ్వర్యం లో జరగను న్న ఈ ఉత్సవాల్లో బీజేపీ సీనియర్ నా యకులు పిట్టల సత్యం, జిల్లా, పట్టణ కార్యదర్శి దూసరి శివకృష్ణ, హెడ్ కాని స్టేబుల్ చిలుక శ్రీనివాస్‌తో పాటు అమ్మ వారి మాల ధరించిన భవానీ మాతలు పాల్గొననున్నారు. ఉత్సవాల సందర్భం గా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అ మ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వా హకులు కోరారు .

అభయ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:మహాలయ అమావాస్యను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అలంకార్ సెంటర్లో అభయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అభయ సేవా సమితి అధ్యక్షులు తోట శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మహాలయ అమావాస్య రోజున పితృ దేవతల ఆశీర్వాదం కోసం ప్రతి యేటా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు, అభయ సేవా సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభయ సేవా సమితి సభ్యులు గుడిపాటి సురేష్, గుండా శంకర్, బక్కవరపు శ్రీను, దేవరశెట్టి సత్యనారాయణ, గజ్జల మురళి, టివిటి రంగనాథ్, తోట శ్రీను, అర్వపల్లి వెంకన్న, బూర్లె మదుసూదన్, మురారిశెట్టి శ్రీధర్, పొన్నాల ఉదయ్, పోతుగంటి మనోహర్, ఓరుగంటి శ్రీను తదితరులు ఉన్నారు.

బాసరలో మూల నక్షత్ర వేడుకలకి పటిష్ట భద్రత

*** ఏఎస్పీ సాయికిరణ్ ప్రత్యేక ఆదేశాలు**



ప్రజాస్ఫూర్తి, భైంసా:శారదీయ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 16న బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి బాలలయంలో నిర్వహించనున్న మూలా నక్షత్రం సందర్భంగా అక్షరాభ్యాస పూజలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను శనివారం భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఆలయ ఈవో అంజనీ దేవి, బాసర ఇన్‌స్పెక్టర్ దీపక్, ముధోల్ సీఐ రవీందర్‌తో కలిసి పరిశీలించారు.బాలాలయ పరిసరాలు, భక్తుల రాకపోకల మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, క్యూ లైన్ల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని, రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ సంజీవరావు, శివరాజ్,అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

*** ప్రజలకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచనలు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):దసరా పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఖాళీగా ఉండే ఇళ్లలో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పండుగ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరి ఇళ్ల పరిసరాల్లో పోలీసు గస్తీని పెంచినట్లు ఎస్పీ తెలిపారు. రాత్రివేళ ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు వెల్లడించారు.ప్రయాణాలకు వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేయాలని, నగదు, బంగారం, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. తాము ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయడంతోపాటు, అవసరమైతే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ఇంటి వద్ద సీసీటీవీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని, ప్రయాణ వివరాలు, ఇంటి భద్రతకు సంబంధించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యమని, దసరా సెలవులను సురక్షితంగా గడిపేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ విశిష్ట సంస్కృతి, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

*** శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ విశిష్ట సంస్కృతి, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ లోని భగత్సింగ్నగర్లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు సాంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాఠశాల అవరణంలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆట పాటలతో కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదా యాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని పే ర్కొన్నారు.బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెం పొం దిం చేం దుకు ఇలాం టి వే డు క లు ని ర్వ హి స్తు న్నా మ ని తెలి పా రు.అ నం తరం పా ఠ శా ల ఆవరణంలోని ప్రశాంత వాతావరణంలో బతుకమ్మలను నిమజ్జనం చేసి,అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభా రాణి, డైరెక్టర్లు సాయి ప్రియ,ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

చదువే కాదు నైపుణ్యమే ప్రపంచంలో నిజమైన ఆయుధం

మ హ బూ బా బా ద్ , ప్ర జా స్ఫూర్తి:విద్యార్థులు పోటీ ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తె చ్చు కో వా లం టే చ దు వు తో పా టు వి వి ధ నై పు ణ్యా ల ను పెంపొందించుకోవాలని తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ విద్యా సంస్థ నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్తి గార్డెన్స్‌లో కళాశాల ప్రిన్సిపాల్ వై.కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నిర్దేశించుకునే లక్ష్యాలే భవిష్యత్తుకు పునాది అని అన్నారు.విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. మహబూబాబాద్ డీఎస్పీ ఎన్. తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్యం లేని చదువు జీవితానికి ఉపయోగపడదని,ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని కోరారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మైస శ్రీనివాస్,లక్ష్మణ్, డోలి లింగబాబు,పిల్లి సుధాకర్,వైస్ ప్రిన్సిపల్ శంకర్, జూనియర్ ప్రిన్సిపల్ శ్రీపాల్ రెడ్డి,అధ్యాపకులు ప్రసాద్,రమేష్, రవిశంకర్,రాజు, ప్రసాద్,శేఖర్,కే ప్రసాద్,ఉప్పలయ్య, రవి,కుమార్,కిషన్, ముత్తయ్య,నరేష్, రేణుక,పూజిత, సిబ్బంది,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి

సర్ ప్రక్రియను రద్దు చేయాలి



ప్ర జా స్ఫూ ర్తి , కొ త్త గూ డెం : కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ నందు గల అమరవీరుల స్తూపం వద్ద ఉపాధ్యాయుల సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను , తొలగించడంతోపాటు సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనను చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ నాయకులు .రాజు, రాంబాబు, మురళీమోహన్, వెంకటేశ్వర్లు, హరిలాల్ పాల్గొని మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఏకపక్ష నిర్ణయాలను సమీక్షించాలని,ఎన్నికల కమీషన్ స్వతంత్రను కాపాడాలి అని, సర్ ప్రక్రియను రద్దు చేయాలి అని,ఇప్పటి వరకు తొలగించిన 13 కోట్ల ఓట్లపై సమగ్ర, స్వతంత్ర విచారణ చేపట్టాలి అని,ఎన్నికల కమీషనర్ల నియామక చట్టం 23 ను రద్దు చేయాలి , ఈవీఎం బదులు బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వెంకటేశ్వర్లు,(ఎస్ వి) ఎం రాజయ్య, జయరాజు,.దాసు, విజయ్ కుమార్, అక్బర్, హరి సింగ్, మంగీలాల్, అంబ్రిక జాదవ్, రాజారావు, వెంకటేశ్వర్లు, .బాలు, బుచ్చిరాములు, సత్యనారాయణ, సుందర్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు,.వసంతరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

*** ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం**

*** ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి:రూరల్ సీఐ వేణు**




రఘునాథపల్లి,ప్రజాస్ఫూర్తి:దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జనగామ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమని, అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ రఘునాథపల్లి, లింగాలఘణపురం, చిల్పూర్ మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.దసరా పండుగ నేపథ్యంలో చాలామంది కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రాత్రి వేళ పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ముందస్తు జాగ్రత్తలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

*** పోలీసుల సూచనలు.. ఇవి పాటించండి**

ఇంట్లోని బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. పెద్ద మొత్తంలో నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంకు ఖాతాల్లో భద్రపరచుకోవాలి. విలువైన వస్తువులు బయటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఊరికి వెళ్లే ముందు ఇంటి తలుపులు, కిటికీలు పటిష్టంగా ఉన్నాయో లేదో పరిశీలించి నాణ్యమైన తాళాలు వేయాలి.ఇంటికి తాళం వేసి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలి. అవసరమైతే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నవారు వాటి పనితీరును పరిశీలించి, మొబైల్‌లో ఫుటేజీని ఎప్పటికప్పుడు గమనించాలి. రాత్రి వేళల్లో ఇంటి ఆవరణలో లైట్లు వెలిగేలా చూసుకోవాలి.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, చోరీకి సంబంధించిన అనుమానాలు కలిగినా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ వేణు కోరారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల సహకారంతో చోరీలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.

సీరతున్ నబీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్:ఫరూక్నగర్ అంజుమన్ ఫంక్షన్ హాల్ లో సిరతున్ నబీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనటువంటి వారికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థిని,విద్యార్థులు మహమ్మద్ ప్రవక్త ఆచరించి అమలుపరిచిన విధానాలు వారి యొక్క అడుగుజాడల్లో నడిచి ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సు పై తోడ్పడాలని విద్యార్థులకు తెలిపారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానని గౌస్ జానీ మరి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ గౌస్ జానీ, నందకిషోర్,మహమ్మద్ ,జావేద్ ఆగజ్, సోషల్ వర్కర్ ఆలియా సుల్తానా, మదర్సా టీచర్ ఆమెనా ఫాతిమా, తల్లిదండ్రులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య కూటమి నాయకులను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

ప్రజాస్ఫూర్తి,కొత్తగూడెం: ఆర్టీసీ ఎన్నికల్లో కొత్తగూడెం డిపో తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల్లో విజయం సాధించి రీజియన్ వ్యాప్తంగా గుర్తింపు సాధించిన ఐ ఎన్ టి యు సి సారిధ్యంలోని ఐక్య కూటమి నేతలను విద్యానగర్ కాలనీలో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి , మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాటు పాలించిన బిఆర్ఎస్ కేసిఆర్ పాలనలో ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఒక ఇంక్రిమెంట్ కూడా ఇవ్వలేదని ఆర్టీసీ ప్రైవేటుపరం చేస్తానని కార్మికులను బెదిరించడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచి రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వడంతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే కార్యక్రమం తో పాటు ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు నిర్వహించారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా నాయకులు రజాక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. కే జానీ పాషా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దుర్గమాత వేడుకలకు రావాలని ఎమ్మెల్యే కు ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి,భైంసా:దసరా నవరాత్రుల్లో తమ గ్రామానికి రావాలని నిర్మల్ జిల్లా కుభీర్ మండలం లోని సిర్పెల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ను ఆహ్వానించారు..భైంసా లోని ఎమ్మెల్యే నివాసం లో వారు కలిశారు.తమ గ్రామం లో గత కొన్ని సంవత్సరాలు గా కర్ర దుర్గమాత విగ్రహాన్ని ప్రతిష్టపన చేస్తున్నామన్నారు.. వేడుకలను వైభవోపేతంగా జరుపుతామని పెద్ద మొత్తం లో భక్తులు తరలిరావాలని కోరారు.

కన్నీటి వేళ చూపిన మానవత్వం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: కేస ముద్రం మున్సిపాలిటీ చైతన్యనగర్ కాలనీలో విషాదం నెలకొంది.90 ఏళ్ల వృద్ధుడు కొమ్ము సాయిలు మరణించడంతో ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శించారు. సాయిలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి బియ్యం,ఆర్థిక సహాయం అందించి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి మాట్లాడుతూ, చైతన్యనగర్ కాలనీతో సమ్మయ్య గౌడ్ కు 26 ఏళ్ల అనుబంధం ఉందని, కష్టంలో అండగా నిలవడం ఆయన మానవత్వానికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి,మాదిగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పోలేపాక ఉప్పలయ్య,మాజీ ఎంపీటీసీ రాహుల్,కీర్తి సురేందర్, మాసాడి శ్రీనివాస్,కత్తెరసాల శ్రీనివాస్,చిట్ల రవి,కొమ్ము వెంకన్న,పందుల సారయ్య,వల్లందాసు దేవదానం,కొమ్ము సంజీవ,పెండెల లక్ష్మణ్,కడారి నాగయ్య,కొమ్ము రామకృష్ణ,పందుల శ్రీను,జిలకర బాబు, కొమ్ము అనిల్, అజ్మీరా రమేష్, వల్లందాసు వెంకన్న, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

*** హుస్నాబాద్. ఏసీపీ ఎస్. సదానందం,**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి:విగ్రహాల ప్రతిష్ఠాపన ఊరేగింపుల నిర్వహణకు పోలీసులకు ముందస్తు సమాచారం తప్పనిసరి అని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మండపాల నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దుర్గాదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపులు నిర్వహించదలచిన నిర్వాహకులు ముందుగా తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా సమాచారం అందించిసూచించారు.దుర్గాదేవి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇంటిమేషన్ ఫారాలను సమర్పించాలని స్పష్టం చేశారు.

మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా వీరంరెడ్డి శంబిరెడ్డి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా సబండ వర్గాలను ఏకం చేస్తూ... హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉద్యమాన్ని ఉవ్వెత్తున కొనసాగించడం కోసం పోలీస్ అధికారులకు ఎదురొడ్డి నిలిచి, లాటి దెబ్బలకు, తుపాకి తూటాలకు, కేసులు పెడతామని బెదిరించినా.. రాష్ట్ర సాధనే నా లక్ష్యం అంటూ ఆనాటి జేఏసీ టిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ప్రతినిత్యం స్పందిస్తూ ఉద్యమ స్ఫూర్తి నింపిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు వీరం రెడ్డి శంబిరెడ్డి తను ఆస్తులను సైతం అమ్మి తెలంగాణ రాష్ట్రం వస్తే మనం మన పిల్లలు బాగుంటారని, మన ఉద్యోగాలు.. మన నీళ్లు.. మన నిధులు.. మన తెలంగాణ ప్రాంత బిడ్డలకు దక్కాలని, అనేక అవమానాలను ఆటుపోట్లను ఎదుర్కొని ధైర్యంగా నిలిచిన వ్యక్తి.. "వీరం రెడ్డి శంబిరెడ్డి "ని మలిదశ తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు "సామ అంజి రెడ్డి" ఆశీస్సులతో.. మన సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాయపూడి వెంకటనారాయణ సూచనలతో..మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా గా ప్రకటించారు.

వివేకవర్ధని డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం:లక్ష్మీదేవి పల్లి లో గల వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవరణంలో బతుకమ్మ సంబరాలను ఆర్ట్స్ , కల్చరల్ విభాగపు అధ్యాపక బృందం సంధ్యా ప్రసాద్ , రజిత , దివ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు . ముందుగా విద్యార్థులు తయారు చేసిన బతుకమ్మలు చూడముచ్చటగా పూలతో చేసిన వివిధ అలంకరణలతో చేసిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మలతో కళాశాల ఆవరణమంతా పూలవనంగా మారటం తో పాటు ఆటపాటలతో విద్యార్థులు సందడి చేస్తూ కళాశాల ఆవరణమంతా మారు మ్రోగింది . అనంతరం విద్యార్థులకు ఉత్తమ బతుకమ్మలకు బహుమతులను పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్ , డీన్ సాయి కృష్ణ , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లేష్ , అకాడమిక్ డైరెక్టర్ కిరణ్ , ఏవో ప్రవీణ్ , టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

బేతోలు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామంలో శనివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 13వ ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నుండి చాదర్,సందల్, ఖందిల్,జెండాలను డీజే,డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించి దర్గా వద్ద ప్రతిష్టించారు. అనంతరం దర్గా వద్ద, గౌసియాపాక్ జెండా గద్దె వద్ద ప్రత్యేక ఫాతిహా ప్రార్థనలు నిర్వహించారు.వేడుకల అనంతరం పాఠశాల ప్రాంగణంలో భక్తులకు, గ్రామస్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్,షేక్ ఖాదర్ బాబా,షేక్ జావిద్ (సదర్ సాబ్), షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లో యాదవ భవన్ నిర్మాణ పనులను పరిశీలించిన

*** అఖిల భారత యాదవ మహాసభ జనరల్ సెక్రటరీ జెకె శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: యాదగిరిగుట్ట లో యాదవ భవన్ నిర్మాణ పనులను శనివారం మేడ్చల్ అర్బన్ జిల్లా ఒబిసి బీజేపీ అధ్యక్షుడు, అఖిల భారత యాదవ మహాసభ జనరల్ సెక్రటరీ జెకె శేఖర్ యాదవ్ ,మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి లు పాల్గొని పర్యవేక్షించారు.వీరి తో పాటు గండి రాజు యాదవ్, యాదగిరి యాదవ్ తదితరులున్నారు.

పంజాబ్ ల్యాండ్స్ 22/ఏ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

*** ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని కోలూరు, హంగిర్గ, హిపెనెల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంజాబ్ ల్యాండ్స్ 22/ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టాదారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో తానూర్ మండలంలోని సుమారు 2,500 ఎకరాల భూములకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించిన వివరాలు, పట్టాదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.రైతులు కూడా తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి, విచారణకు సహకరించాలని కోరారు.అలాగే 27వ ప్యాకేజీ కింద చేపట్టే పనులు పూర్తయితే తానూర్ మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేక ఇబ్బందులు పడకుండా, వి.బి.జి. రామ్‌జీ పథకం కింద వ్యవసాయ రహదారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. వ్యవసాయ పనుల సమయంలో రైతులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, తహసీల్దార్, సంబంధిత రెవెన్యూ అధికారులు, మండల సీనియర్ నాయకులు,రైతులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ సమరానికి 'వర్షిణి' సిద్ధం!





*** అశ్వారావుపేటలో జరిగే జూనియర్ బాలికల పోటీల్లో జిల్లా ప్రాతినిధ్యం..**

*** గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగిన తిప్పర్తి కిరణం..**

ప్రజా స్ఫూర్తి, నల్గొండ :గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే వారు జాతీయ, రాష్ట్ర స్థాయిలలో సత్తా చాటుతారని తిప్పర్తి విద్యార్థిని జెరిపోతుల వర్షిణి మరోసారి నిరూపించింది.నల్గొండజిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న వర్షిణి,తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఆమె ప్రదర్శించిన అత్యుత్తమ రైడింగ్, డిఫెన్స్ మెళకువలు, శారీరక దార్ఢ్యం క్రీడాభిమానులను, ని ర్వా హ కు ల ను వి శే షం గా ఆకట్టుకున్నాయి. దాంతో ఆమె రాష్ట్ర స్థాయి జట్టులో చోటు దక్కించుకుంది.

*** 33 జిల్లాల క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు..**

భ ద్రా ద్రి కొ త్త గూ డెం జి ల్లా అశ్వారావుపేట ప్రాంగణంలో ఈ నెల అక్టోబర్ 10 నుండి 13 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వర్షిణి పాల్గొననుంది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుంచి అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో తలపడనుండగా, మన జిల్లా తరఫున వర్షిణి ముఖ్య భూమిక పోషించనుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే వర్షిణికి కబడ్డీపై ఉన్న ప్రత్యేక ఆసక్తి, నిరంతర సాధన ఈ స్థాయికి చేర్చాయని ఆయన కొనియాడారు.

*** క్రీడల్లో రాణిస్తే బాసటగా నిలుస్తాం హెచ్ఎం పి. నరసింహ నాయక్..**

వర్షిణి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. నరసింహ నాయక్ ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. వర్షిణిని పూలమాలలు, శాలువాతో ఘనంగా అభినందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వర్షిణి తన ప్రతిభతో ప్రతి ప్రత్యర్థిని చిత్తు చేసి, జిల్లాకు అలాగే పాఠశాలకు బంగారు పతకంతో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

*** పాఠశాల వ్యాప్తంగా పండుగ వాతావరణం**

తన ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైన వర్షిణిని సీనియర్ ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మీయంగా అభినందించారు. వర్షిణి విజయం తోటి విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరిగేలా చేసిందని ఉపాధ్యాయులు తెలిపారు.

కృష్ణ కాలనీలో 40 అడుగుల రహదారి

*** ఇళ్లకు నష్టం తగ్గించేలా నిర్ణయం**





భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): అంబేద్కర్ స్టేడియం నుంచి కృష్ణ కాలనీ డౌన్ వరకు ప్రతిపాదించిన రహదారి వెడల్పును 60 అడుగుల నుంచి 40 అడుగులకు కుదించాలని నిర్ణయించారు. స్థానికుల ఇళ్లకు నష్టం కలగకుండా ఐదో వార్డు కౌన్సిలర్ కట్ల పూర్ణచందర్, ఆరో వార్డు కౌన్సిలర్ ఎరుకల రేణుక గణపతి చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య సానుకూలంగా స్పందించారు.60 అడుగుల రహదారి విస్తరణ చేపడితే పలు కుటుంబాల ఇళ్లకు నష్టం వాటిల్లే అవకాశముందని కౌన్సిలర్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 40 అడుగుల రహదారిని సెంట్రల్ లైటింగ్‌తో అభివృద్ధి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. రహదారి అభివృద్ధితోపాటు స్థానికుల నివాసాలకు నష్టం తగ్గించేలా చర్యలు చేపట్టనున్నారు.కృష్ణ కాలనీకి మెరుగైన రహదారి, ఆధునిక లైటింగ్ సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని కౌన్సిలర్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: డిసిసి కోశాదికారి కక్కిరేణి శ్రీనివాస్ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం, ఈ రోజున తెలంగాణ లోని యువతులు, మహిళలు కాలనిలలో, కూడళ్ళలో, చెరువుల దగ్గర అందరూ కూడి ఆటపాటలతో బతుకమ్మ ఆడి తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ప్రజలకు,ఆడపడుచులకు ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. డి సి సి కోశాదికారి కక్కిరేణి శ్రీనివాస్ తన నివాసంలో తన చెల్లెలు,బావ, భార్య, కూతురుతో కలసి బతుకమ్మను పేర్చారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

*** జిల్లా అదనపు కలెక్టర్ బెన్షా లోమ్.**

*** షామీర్‌పేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ అధికారులకు సూచించారు.శనివారం మండలం షామీర్‌పేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ధాన్యం సేకరణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో తేమ శాతం ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్ర నిర్వాహకులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, డీటీసీఎస్‌లు, గ్రామ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సుమన్ యువసేన ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సుమన్ యువసేన సుమన్ వెంకన్న ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని శంకర్ విలాస్ సెంటర్ ఎదురు బజార్లో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి సుమన్ యువసేన ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య సందర్భంగా సాంప్రదాయ పద్ధతిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలుగు వెంకన్న,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా,బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్, బండారు రాజా, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ,సోమ ప్రవీణ్ డోగుపర్తి ప్రవీణ్,నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మికాంత్, కక్కిరేణి ప్రసాద్,ముదిరెడ్డి రమణారెడ్డి, పిల్లల రమేష్ నాయుడు, బ్రాహ్మణపల్లి మురళిధర్, తాళ్లపల్లి రామయ్య, పబ్బా ప్రకాష్, కర్నాటి సురేందర్, నిర్వాహకులు గోపారపు రాజు,సుమన్ వెంకన్న,బొల్లం సురేష్, మొరిశెట్టి రాము, చందా రాజశేఖర్,గుడిపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు

ఎక్సైజ్ శాఖ కొరడా ఏడుచోట్ల దాడులు



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి: వరంగల్ డివిజన్ డిప్యూటీ కమీషనర్ దత్తురాజ్ గౌడ్, అసిస్టెంట్ కమీషనర్ నవీన్ చంద్ర ఆదేశాల మేరకు, మహబూబాబాద్ జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారి కరంచంద్ పర్యవేక్షణలో ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. మహబూబాబాద్ స్టేషన్,వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ టీమ్, డీటీఎఫ్ మహబూబాబాద్ టీమ్,గూడూరు స్టేషన్ టీమ్ సంయుక్తంగా డోర్నకల్ మండలంలోని తెల్లబండ తండా,రామకుంట తండా, టేకుల తండా, మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండాలలో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులు నాటుసారాతో పట్టుబడ్డారు.వారి వద్ద నుండి 16 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.అలాగే 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.మొత్తం 7 కేసులు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపారు. నాటుసారా తయారు చేసినా,అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ దాడుల్లో ఎస్ఐలు శ్రీనివాస్,రాజేందర్, వెంకటేష్,ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు భోజనశాల

*** రూ. 3 లక్షలతో ఆధునీకరించిన పూర్వ విద్యార్థి తీగల నర్సిరెడ్డి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:చదువుకున్న బడి రుణం తీర్చుకుంటూ ఓ పూర్వ విద్యార్థితన దాతృత్వాన్నిచాటుకున్నారు.మండల పరిధిలోనికల్మలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి తీగల నర్సిరెడ్డి తన అమ్మమ్మ దొంతిరెడ్డి నరసమ్మ జ్ఞాపకార్థం రూ. 3 లక్షల సొంత నిధులతో నూతన భోజనశాలను సమకూర్చారు.పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న పాత భవనానికి రంగులు వేయించి, కొత్త కిటికీలు, తలుపులు అమర్చి విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుని మధ్యాహ్న భోజనం చేసేలా అధునాతన సీటింగ్ సదుపాయంతో దీనిని తీర్చిదిద్దారు. నూతనంగా నిర్మించిన ఈ భోజనశాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దొంతిరెడ్డి పెదరామిరెడ్డి, రమణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు, గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను, ఉప సర్పంచ్ కందుకూరి కృష్ణారెడ్డి, 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీ చైర్మన్ పాశం అరుణతో పాటు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చి వసతులు కల్పించిన దాత నర్సిరెడ్డిని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల విద్యార్థి ఎంపిక



చిట్యాల, (ప్రజా స్ఫూర్తి):రాష్ట్ర స్థాయి అండర్ 14 ట్రయాథ్లాన్ అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బానోత్ శ్రీధర్ ఎంపికయ్యాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకున్నాడు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి.విద్యార్థి ఎంపిక పట్ల మండల విద్యాధికారి కొడపాక రఘుపతి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి ఆకాంక్షించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తితో పాటు ఉపాధ్యాయులు శ్రీధర్‌ను అభినందించారు.

శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: అక్టోబర్ 11వ తేదీ ఆదివారం నుండి అక్టోబర్ 20 (విజయదశమి) దసరా మంగళవారం రోజు వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడతాయని, శ్రీ సిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు శనివారం విలేకరుల సమావేశంలో తెలియ చేశారు.ఈ సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక యూత్ సభ్యులు మాట్లాడుతూ పలు కార్యక్రమాలైనా శ్రీ దుర్గా మాత ఆగమనము, ప్రతిష్ఠ మహోత్సవము, శ్రీ సిద్ధి వినాయక యూత్ జన్నారం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవములు దుర్గామాత ఆగ మన శోభాయాత్రతో ప్రారంభమై విజయదశమి (దసరా)రోజున అమ్మవారి నిమజ్జనంతో ఉత్సవములు ముగుస్తాయని తెలియజేశారు. ఆదివారం జక్కు సత్తయ్య షాపు నుండి దుర్గామాత ఆగమన శోభాయాత్ర ప్రారంభమవుతుందని, మండల కేంద్రంలోని స్థానిక బొక్కల దవాఖాన ప్రక్కన గల శ్రీ సిద్ధి వినాయక మండపం వద్ద ఉదయం 8 : 00 గంటలకు ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలందరూ ఇదే తమ భక్తి పూర్వక ఆహ్వానంగా స్వీకరించి ప్రజలందరూ మహిళలందరూ మంగళహారతులతో విచ్చేసి, అమ్మవారి ఆగమనానికి ఘన స్వాగతం పలికి, ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని వారు కోరారు. అంతేకాకుండా శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులందరూ ధన రూపేనా వస్తురూపమైన తమకు తోచిన సహాయ సహకారాలు అందించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు, సహాయ సహకార సహకారాలు అందించడం కోసం వివరాలకు శ్రీ సిద్ధి వినాయక యూత్ సభ్యులైన శరత్ చంద్ర: 7674090905, వెంకటేష్: 800882704, రాజు బేసిక్స్: 9440387723. వీరిని సంప్రదించాలని తెలిపారు.

చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్ లోగల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా విద్యార్థినిలు,ఉపాధ్యాయురాళ్ళు తయారు చేసిన బతుకమ్మలు చూడముచ్చటగా పూలతో చేసిన వివిధ అలంకరణలతో చేసిన బతుకమ్మలు అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ జీవన విధానంలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు.అనంతరం ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివరాత్రి మంగాదేవి, ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

బౌద్ధ సమాజ అభివృద్ధికి కృషి చేస్తా

*** కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్ నాయక్**




కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బౌద్ధ సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్యామ్ నాయక్ అన్నారు. శనివారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన సమావేశపు షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం తన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.జేత్వాన్ బుద్ధ విహార్‌లో రూ.6 లక్షలతో నిర్మించనున్న సమావేశపు షెడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బౌద్ధ సమాజ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

*** బుద్ధ విహారాలకు నిధుల మంజూరు**

వాంకిడి మండలంలోని భీమ్‌నగర్, ఖమన, సరాండి, కనర్గాం గ్రామాల్లో బుద్ధ విహారాల నిర్మాణానికి రూ.7.5 లక్షలతోపాటు, మండల కేంద్రంలో బుద్ధ విహార్ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన శ్యామ్ నాయక్, వాంకిడి ఉప సర్పంచి దీపక్ ముండేలను భారతీయ బౌద్ధ మహాసభ, అంబేడ్కర్ సంఘం, సమతా సైనిక దళ్ నాయకులు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్, సమతా సైనిక దళ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్, మాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులే నారాయణ, వాంకిడి సర్పంచి చునార్‌కార్ సతీష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే మేంగాజి, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు దుర్గం దుర్గాజి, ప్రధాన కార్యదర్శి విజయ్ వర్షవాస్, కమిటీ అధ్యక్షుడు దుర్గం శ్యామ్‌రావు, నాయకులు రాజేశ్వర్, శ్యామ్‌రావు, పాండు జీ, హంసరాజ్, విలాస్, రోషన్, ప్రతాప్, అరుణ్, విట్టల్, దీపక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, దీని ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య చేరువవుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న విద్యా వసతుల కల్పన కోసం గత నెల రోజులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో జీవో నెంబర్ 187 ద్వారా పాఠశాల మంజూరైందని చెప్పారు. పాఠశాల అభివృద్ధి పనుల నిమిత్తం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పోష్టికమైన ఆహారంతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నానని ఆయన అన్నారు.. రాబోయే నాలుగు ఐదు రోజుల్లోనే ప్రజాప్రతినిధుల సమక్షంలో పాఠశాల పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సుజాతనగర్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాత పంచాయతీ ఆఫీస్ స్థలంలో మోడల్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, మేయర్ మూడ్ గణేష్, డీఈవో వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ స్థానిక నాయకులు పాల్గొన్నారు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కేడం లింగమూర్తి

*** ఘనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ 63వ జన్మదిన వేడుకలు.**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి:పేదల పక్షపాతిగా బడుగు బలహీన వర్గాల నాయకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి 63వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కన్నపేట చౌరస్తాలో అభిమానులు, ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేడం లింగమూర్తి అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ పేదల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆకాంక్షిస్తూ పలువురు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందించేలా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

బతుకమ్మ నిమజ్జనంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలి

*** జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ శర్మ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు**



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం సందర్భంగా శనివారం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతిలో సహజంగా లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల వైభవానికి నిదర్శనమన్నారు.మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలకు,ప్రకృతితో మానవాళికి ఉన్న విడదీయలేని సంబంధానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందన్నారు. తొమ్మిది రోజుల వేడుకలతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

*** నిమజ్జనంలో అప్రమత్తత అవసరం**

బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా గోదావరి, చెరువులు, కుంటలు, వాగుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నీటిలోకి లోతుగా వెళ్లకూడదని, చిన్నపిల్లలను నిమజ్జన ప్రాంతాలకు తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా సూచనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నిమజ్జన ప్రాంతాల్లో మున్సిపల్, పంచాయతీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సంప్రదాయాలను గౌరవిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోండి..

*** విద్యుత్ బిల్లును తగ్గించుకోండి**

*** ఎస్ఈ ఉత్తమ్ జాడే**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే కోరారు.పీఎం సూర్య ఘర్-ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ పథకం కింద 1 కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ప్లాంట్ సామర్థ్యం, విద్యుత్ వినియోగం, సౌర విద్యుత్ ఉత్పత్తిని బట్టి విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు.అర్హులైన వినియోగదారులు https://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగంతో ఆర్థిక ఆదాతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని, అర్హులంతా ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.

సుజాతనగర్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు పట్ల హర్షం

*** నాగ సీతారాములు**




ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు అయిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు హాజరైన పత్రికా విలేకరుల సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ పాల్గొని ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సుజాతనగర్ కు మంజూరు చేయించడంలో సహకరించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులకు , ఇద్దరు ఎంపీలకు ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ , సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పబ్లిక్ స్కూల్ విద్యా విధానం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందుతుందని , సుజాతనగర్ మండల కేంద్రంలో స్కూలు ఏర్పాటు చేయడం పట్ల ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు . ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులతో పాటు పోరా ప్రముఖులు విద్యావేత్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు పక్కన పెట్టి సేవా బాట పట్టిన బాలికలు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:సమాజాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ పై ఉందని లైబ్రరీ అసోసియేషన్ స్టేట్ మెంబర్ పెండ్లి అశోక్ అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పొక్కుల సదానందం అధ్యక్షతన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పేద, బలహీన వర్గాల్లో మూఢనమ్మకాలను తొలగించి సామాజిక చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపల్ సదానందం మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి మర్సకట్ల అనిల్ కుమార్, ప్రోగ్రాం అధికారి చొప్పరి శ్రీనివాస్, కౌన్సిలర్ ధూపట్టి స్పందన వినయ్, ప్రధానోపాధ్యాయులు అంకటి వెంకటేశ్వర్లు, గట్ల శ్రీపాల్ రెడ్డి, బుర్ర గోవర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

*** ఎస్పీ నితికా పంత్**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మండపాల నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు తప్పనిసరి: దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. సంబంధిత పోలీసు అధికారులు మండపాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరమే అనుమతులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, రహదారులు, కాలిబాటలను ఆక్రమించరాదని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఉత్సవాల్లో డీజే సౌండ్ వినియోగం నిషేధమని ఎస్పీ స్పష్టం చేశారు. ఇతర మతాల వారి మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు, వివాదాస్పద పాటలు, రెచ్చగొట్టే అంశాలకు తావివ్వకూడదన్నారు. మండపాల వద్ద భద్రత, క్రమశిక్షణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వాలంటీర్లను నియమించి, వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ కాని వార్తలు, సందేశాలు, వీడియోలను ఇతరులకు ఫార్వర్డ్ చేయకూడదని ఎస్పీ కోరారు. ఉత్సవాల సమయంలో సంయమనం పాటిస్తూ, ఇతరుల మత విశ్వాసాలను గౌరవించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనా, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, పోలీసుల అనుమతులు పొందిన అనంతరమే విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టాలని, ప్రజలంతా పోలీసులకు సహకరించి దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా విజయవంతం చేయాలని ఎస్పీ నితికా పంత్ కోరారు.

పరిశుభ్రత వెనుక ఉన్న చేతులకు చీరె సారెతో ఘన సన్మానం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్ లో శ్రీ వాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్ర వితరణ,అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది.పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి ట్రస్ట్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్,19వ వార్డు కౌన్సిలర్ చిద్దిరాల అరుణజ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా మహిళా సిబ్బందికి చీరలు, పురుష సిబ్బందికి దుప్పట్లు,చేతి సంచులను పంపిణీ చేశారు. సుమారు 150 మందికి పైగా కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బతుకమ్మ సంబరాలు,కరోనా వంటి విపత్కర సమయాల్లో ప్రాణాలకు తెగించి ప్రజారోగ్యాన్ని కాపాడిన కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ నిర్మాతలు మహిళలే : విజయ

*** స్వేచ్ఛ మండల అధ్యక్షులుగా సైదమ్మ..**



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : మన దేశ భవిష్యత్తు నిర్మాతలుగా మహిళలు అత్యంత క్రియాశీలకంగా అన్నిరంగాల్లో విజయ్ దుందుభి మోగిస్తున్నారని స్వేచ్ఛ ఉమెన్స్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు భీమపంగు విజయ అన్నారు.శనివారం మండలంలోని పొనుగోడు గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో మహిళల పాత్ర అద్వితీయమైందని, కుటుంబ సంరక్షణ నుండి దేశ సమగ్ర భవిష్యత్తు నిర్మాతలుగా మహిళలే వ్యవహరిస్తున్నారు అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలలో మహిళలని దేవత రూపంలో కొలుస్తారని, ఒక తల్లిగా, కూతురిగా, సోదరిగా, భార్యగా విభిన్న రూపాలలో అష్టకష్టాలను ఓర్చి భూమాతంత సహనంతో కుటుంబ పారాన్ని మోస్తుందని కీర్తించారు. కానీ కొందరు కిరాతకులు మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ, లవ్ జిహాద్ ల పేరుతో యువతలను మోసగిస్తున్నారని, వారిని ఆట వస్తువులుగా వాడుకుంటూ నిట్ట నిలువు నా ప్రాణాలను హరించడం దుర్మార్గమైన హేయమైన చర్య అన్నారు. మహిళ లోకానికి అండగా స్వేచ్ఛ ఉమెన్స్ ఆర్గనైజేషన్ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి సైదమ్మను గరిడేపల్లి మండల అధ్యక్షురాలుగా సంస్థ తరఫున ఎంపిక చేసి నియామక పత్రాలందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందిపాటి సంధ్యారాణి, నందిపాటి వెంకటమ్మ,, కాంతమ్మ, నెమ్మాది జానమ్మ, మిడతపల్లి యల్లమ్మ, తదితరులున్నారు.

అంగన్వాడీ కేంద్రం కు కుర్చీలు, గోడ గడియారం బహుకరణ



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అంగన్వాడీ చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గ్రామ ఏడవ వార్డు సభ్యుడు బోర్లకుంట శివశంకర్ ముందుకు వచ్చారు. శనివారం రోజున తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం నంబర్-1కు చిన్నారుల అవసరాల కోసం కుర్చీలతో పాటు గోడ గడియారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అవసరమైన మౌలిక సదుపాయాల రూప కల్పనకు తనవంతు సహకారం అందించడం తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.చిన్నారుల సౌకర్యాలే లక్ష్యంగా తన వంతుగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జాడి సంజీవరాణి, ఆయా మమత, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్‌తో పాటు మల్లయ్య, వెంకట్, రాజన్న, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన వస్తువులను అందించిన బోర్లకుంట శివశంకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు

'యూపీఎస్సీ తరహాలో లా కమిషన్ ఏర్పాటు చేయాలి'

బషీర్‌బాగ్: న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి అమల్లో ఉన్న కొలీజియం వ్యవస్థ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కొలీజియం వ్యవస్థను రద్దు చేసి యూపీఎస్సీ తరహాలో లా కమిషన్ ద్వారా న్యాయమూర్తుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'ఉన్నత న్యాయస్థానాల్లో సామాజిక న్యాయం' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ఉన్నత న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఏపీ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ అన్ని రకాల చట్ట, రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకున్నప్పటికీ తొలుత హైకోర్టు, తర్వాత సుప్రీంకోర్టులు కొట్టివేయడం అన్యాయమన్నారు.

రికార్డు డిమాండ్ కు తీటుగా విద్యుత్ సరఫరా

*** జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:మెదక్ జిల్లా లో రికార్డు విద్యుత్ డిమాండ్ రికార్డు డిమాండ్ కు దీటుగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ అంతరాయం పై వివిధ పత్రికల్లో వస్తున్న వరుస కథనాలపై ఆయన స్పందిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ మార్పులు,ఎల్ ని నో ప్రభావం,పెరుగుతున్న ఉష్ణోగ్రతల తో రాష్ట్ర వ్యాప్తము గా విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యము లో మెదక్ జిల్లాలోను విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని,గత సంవత్సరము ఆక్టోబరు నెలలో 282 యం డబ్ల్యూ డిమాండ్ నమోదు కాగా,ఈ



సంవత్సరము ఆక్టోబరు నెలలో 567 ఎండబ్ల్యూ డిమాండ్ నమోదు అయినది అనగా రెండింతల డిమాండ్ పెరిగిందన్నారు.గత ఎండాకాలం మార్చ్ నెల డిమాండ్ 506 ఎం డిమాండ్ దాటి రికార్డు సృష్టించిందని వివరించారు. విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతూనే ఉందని వ్యవసాయము ,గృహ అవసరాల నుంచి విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను బలోపేతము చేయడంతో రికార్డు డిమాండ్ ను మెదక్ జిల్లా విద్యుత్ శాఖ సమర్థవంతముగా ఎదుర్కొంటుందని వివరించారు. విద్యుత్ కోతలు,సరఫరా అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నారు.సబ్ స్టేషన్ ల వద్ద వోల్టేజీ ని మెరుగు పరచడానికి హైద్రాబాదు నుండి 17 2 ఎం వి ఏ ఆర్ కెపాసిటర్ బ్యాంకు లను యుద్ధ ప్రాతిపదికన తరలించి సబ్ స్టేషన్ ల వద్ద బిగించి వోల్టేజి ని మెరుగుపరిచామన్నారు. రామాయంపేట, ధర్మారం మరియు కుచాన్ పల్లి సబ్ స్టేషన్ లో పవర్ ట్రాన్సఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచి ఓవర్ లోడ్ సమస్యను అధిగమించామని, అవసరమైన చోట అదనపు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులతో పాటు వ్యవసాయ సంబంధిత విద్యుత్తును నాణ్యంగా అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈ విషయంలో తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మెదక్ విద్యుత్ శాఖ జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ నారాయణ నాయక్ తెలిపారు. అలాగే పొట్ట దశలో ఉన్న వరి పంటతోపాటు ఇతర పంటలు ఎండిపోకుండా విద్యుత్తు సరఫరా చేస్తున్నామని ఈ విషయంలో అన్నదాతలు ఏమాత్రం ఆందోళన చెందవద్దని నారాయణ నాయక్ స్పష్టం చేశారు.

మా నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

*** ప్రభుత్వానికి లంబాడిపల్లి గ్రామస్తుల విన్నపం..**

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:తమకు ఎలాంటి ఆస్తులు, భూములు లేవని,రోజువారీ కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నామని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకుండా ఇందిరమ్మ కమిటీ మెంబర్లు ఇబ్బందులు పెడుతున్నారని లంబాడిపల్లి గ్రామానికి చెందిన గంజి మానెవ్వ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్న తమ కుటుంబానికి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి లబ్ధి చేకూరలేదని వారు తెలిపారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటేనే ఇల్లు గడిచే పరిస్థితి ఉందని,శాశ్వత నివాసం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మానెవ్వ పేర్కొన్నారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతూ, పరదాలు వేసుకుని ఉంటున్నప్పటికీ, కోతుల బెడదతో చిన్నపిల్లలతో బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నామని వారు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం



వెంటనే స్పందించి, తమకు అర్హత ప్రాతిపదికన ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా వచ్చేలా చూడాలని,తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె ప్రభుత్వానికి, స్థానిక అధికారు లకు, ప్రజాప్రతినిధులకు చేతులు జోడించి విన్నవించారు.

*** అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ మెంబర్ల నిర్లక్ష్యం...?**

ఇందిరమ్మ ఇండ్ల అర్హులను ఎంపిక చేయడంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిజమైన అర్హులకు అన్యాయం చేస్తూ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కొందరు కమిటీ సభ్యుల తీరు ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, గంజి మానెవ్వ వంటి నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దసరా సెలవులకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

: పట్టణ సీఐ సీతారాం

ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్:పట్టణ ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు దొంగతనాల నివారణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డు ఆర్టీసీ కాలనీలో కౌన్సిలర్ సుదీర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగం, వాటి ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సీతారాం హాజరై ప్రజలకు పలు సూచనలు చేశారు.ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడం సులభమవుతుందని సీఐ వివరించారు. సీసీ కెమెరాలు కొనుగోలు చేసేటప్పుడు వాటి నాణ్యత, రికార్డింగ్ సామర్థ్యం



వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.దసరా సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. పరిసరాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో రాత్రి వేళల్లో ఐదు పోలీసు బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయని సీఐ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఐ శివారెడ్డి, క్రైమ్ డిపార్ట్‌మెంట్ కానిస్టేబుల్స్ కరుణాకర్, రాజు, కాలనీ వాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్ కు గౌరవ డాక్టరేట్ డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు ప్రదానం

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్) దక్కింది.గత 26సంవత్సరాలుగా ఆయన సమాజానికి అందించిన విశిష్ట సేవలను,విద్యార్థుల్లో దాగినటువంటి నైపుణ్యాన్ని వెలికి తీస్తూ,సామాజిక చైతన్య కార్యక్రమాలను గుర్తిస్తూ యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ & ఎక్సలెన్స్ వారు ఈ గౌరవాన్ని ప్రకటించారు.ఈ డాక్టరేట్ (ఆనర్స్) అవార్డును యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం ఫౌండర్ చైర్మన్ కే వెంకటేశన్,జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్,రాయబారి ప్రపంచ శాంతి సంస్థ అధ్యక్షుడు డా. పర్వీందర్ సింగ్,డాక్టర్ స్వామి పద్మేంద్ర,అభిషేక్ పుష్కర్,కలరత్న డాక్టర్ కందుకూరి విజయమోహన్ తెలంగాణ యూఏయు డిప్యూటీ డైరెక్టర్,డాక్టర్ వసంత అజయ్ కుమార్ యూఏయూ ఫ్యాన్స్& డైరెక్టర్ ప్రెసిడెంట్,డాక్టర్ ఎం రామచంద్రం,డా.మదన్, ఏకే దయానంద్,డా.రామకృష్ణ టంగుటూరి కన్వీనర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంబర్ వాణిజ్యమండలి గార్ల చేతుల మీదిగా గౌరవ



డాక్టరు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు చెన్నైలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో ప్రధానం చేయడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు. చిగురుమామిడి ప్రాంతానికి చెందిన ఒక సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్ అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీ నుంచి ఈ విధమైన గౌరవాన్ని అందుకోవడంపై స్థానికులు ఎంతో హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీ ఫౌండర్ కే వెంకటేశన్ మాట్లాడుతూ ప్రపంచ శ్రేష్ఠత నాయకత్వం,మానవ సహకారాన్ని గుర్తించడం యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ & ఎక్సలెన్స్, సమాజానికి అర్థవంతమైన సేవలు అందించిన విశిష్ట వ్యక్తులకు ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేయడం జరిగిందన్నారు.ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు,యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం అందించే అత్యున్నత గౌరవాలలో ఇది ఒకటి.ఎవరి జీవితం,పని,ప్రభావం, విలువలు ప్రపంచంపై శాశ్వతమైన సానుకూల ప్రభావాన్ని చూపుతాయో వారిని ఇది గౌరవిస్తుందని,నిజమైన గొప్పతనాన్ని హోదాలు లేదా పదవులతో కాకుండా,సేవ, నిజాయితీ,నూతన ఆవిష్కరణలు, ఇతరులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యంతో కొలుస్తారని అన్నారు. శ్రేష్ఠతను మూర్తీభవించి,మానవాళికి స్ఫూర్తినిచ్చే అటువంటి వ్యక్తుల పట్ల గౌరవానికి ప్రతీకగా ఈ గౌరవ డాక్టరేట్ నిలుస్తుంది అని యునైటెడ్ అమెరికన్ విశ్వవిద్యాలయం ఫౌండర్,చైర్మన్ డా.కే వెంకటేశన్ తెలిపారు.శ్రీనివాస్ కు ఈ అవార్డు రావడం పట్ల మండల ప్రజలు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందిస్తున్నారు.

బతుకమ్మ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గడ్డెన్న వాగు ప్రాజెక్టు పాయింట్ వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి కౌన్సిలర్లతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తాలోడ్ శ్రీనివాస్,ప్రవీణ్, పడ్డపు,శ్రీను,వాసు,సుభాష్,పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మైనర్ బాలికకు సంబంధించిన లైంగిక అశ్లీల వీడియోను

*** ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వ్యక్తిపై జన్నారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

ప్రజాస్ఫూర్తి , జన్నారం:జన్నారం మండలానికి చెందిన ఒక వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోల కోసం వెతుకుతూ, మైనర్ బాలికకు సంబంధించిన లైంగిక అశ్లీల వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వీక్షించడంతో పాటు, అదే వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పోస్ట్ చేసినట్లు గుర్తించబడింది అని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ శనివారం రోజున నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్ సి ఆర్ బి) వారు,సి ఏ ఎస్ ఎం (చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్) సంబంధిత సమాచార వ్యవస్థ ద్వారా గుర్తించి, సైబర్ ట్రిప్‌లైన్ ద్వారా జన్నారం పోలీస్ స్టేషన్‌కు పంపించారని. ఈ సమాచారంపై జన్నారం పోలీస్ స్టేషన్ సైబర్ వారియర్ పోలీస్ కానిస్టేబుల్ ఎల్. సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని. ఈ కేసు లక్షెట్టిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రమణమూర్తి దర్యాప్తు చేపట్టారని తెలిపారు . ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ మైనర్ బాలికలు లేదా బాలబాలురకు సంబంధించిన ఎలాంటి లైంగిక అశ్లీల దృశ్యాలను వీక్షించడం, డౌన్‌లోడ్ చేయడం, నిల్వ ఉంచడం, ఇతరులకు పంపించడం లేదా ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికలపై పోస్ట్ చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. కావున ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున, ప్రజలు అందరూ కూడా సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, మైనర్ బాలబాలికల భద్రతకు భంగం కలిగించే విధంగా లేదా వారి లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వీక్షించడం, భద్రపరచడం లేదా ఇతరులకు పంపించడం చేయరాదని జన్నారం పోలీసు శాఖ వారు సూచించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం

ప్రజాస్ఫూర్తి ,ఖమ్మం జిల్లా:మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఖమ్మం పట్టణంలోని డీపీఆర్‌సీ భవనంలో తాళ్లూరి లక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ సమన్వయకర్తగా దాసరోజు శ్రీనివాస్ వ్యవహరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం వంటి అంశాలు వ్యక్తుల మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడంతోపాటు ఒత్తిడిని అధిగమించేందుకు సరైన అవగాహన, ఆత్మవిశ్వాసం, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మానవతావాదులు, మానసిక ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ రీజినల్ ఇంటెలిజెన్స్ అధికారి శ్రీరామోజు రమేష్, ఖమ్మం జైలు సూపరింటెండెంట్ సక్రు నాయక్, డాక్టర్ సతీష్ బాబు, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ మంజుల, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, సైకాలజిస్ట్ ఏ. నాగరాజు, డాక్టర్ టి. సృజన్ కుమార్, డీసీపీఓ విష్ణు వందన, ఏపీఏఐ అధ్యక్షుడు ఈ. వెంకటేశ్వర్లు, బి స్వాతి ఇన్ఫినిటీ సీడీసీ,బి. పవన్ కళ్యాణ్ ఫిజియోతెరపిస్ట్ తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ పాలనలోనే భూపాలపల్లి అభివృద్ధికి పునాది

*** మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి: భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సమీకృత కలెక్టరేట్ ఎదుట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ చేపట్టారు. కేసీఆర్ హయాంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల, డిగ్రీ కళాశాల, సింగరేణి కార్మికులకు వెయ్యి క్వార్టర్లు, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గండ్ర గుర్తుచేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు, ఈ నెల 12న జిల్లా అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బాలికల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది

*** కొడిపల్లి గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్**



కొడిపల్లి (ప్రజాస్ఫూర్తి):అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొడిపల్లిలో ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సంతోష్ ఆధ్వర్యంలో ముందస్తు బాలికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి హేమబర్గవి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యా, క్రీడలు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొడిపల్లి గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. బాలికల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. నేటి బాలికలే రేపటి భవిష్యత్తు అని, విద్య, క్రీడలు తదితర రంగాల్లో బాలికలు రాణించాలని ఆకాంక్షించారు. బాలికల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు బాలికలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ సంతోష మాట్లాడుతూ బాలికలు బాగుంటే కుటుంబం బాగుంటుంది అని బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్య, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన నిఖిత, నందిని, రేణుక, దివ్య, సౌజన్య, లాస్యప్రియ, నుస్రత్, అరుంధతి తదితర బాలికలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో , ఉప సర్పంచ్ శ్వేత గౌడ్, వార్డు సభ్యులు మురళి నాయక్, ప్రశాంత్, లక్ష్మి, దేవేందర్, రమేష్, నాయకులు పుండరీకం, సత్యనారాయణ గౌడ్, శ్రీకాంత్, శేఖర్, రమేష్ గౌడ్, కరోబార్ ఎల్లం, అంగన్‌వాడీ టీచర్లు ఫరీదా, కమల, సుమిత్ర, నిర్మల, రజియా, రేణుక, మహిళలు, కిశోర బాలికలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాంతితోనే ప్రపంచ ప్రగతి

*** ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.**
*** ఏఐపీఎస్ఓ జిల్లా 4వ మహాసభలో పిలుపు**



ప్రజా స్ఫూర్తి ,నల్లగొండ : అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో నిర్వహించిన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) జిల్లా 4వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యుద్ధాల వల్ల మానవాళికి తీరని నష్టం వాటిల్లుతోందని, ప్రపంచ శాంతి సాధన కోసం ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. వ్యక్తుల ఆలోచనల నుంచే శాంతి లేదా యుద్ధం ప్రారంభమవుతుందన్నారు. చెడు ఆలోచనలు సమాజంలో విభజనలకు దారితీస్తాయని, సామ్రాజ్యవాద విస్తరణ కాంక్షతో అమెరికా వంటి దేశాలు చిన్న దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తమ వ్యాపార ప్రయోజనాల కోసం కొన్ని ఐరోపా దేశాలు సైతం అమెరికా విధానాలకు మద్దతు పలుకుతున్నాయని అన్నారు. యుద్ధాల కారణంగా ఇరాక్, ఇరాన్ తదితర దేశాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్. మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు ప్రపంచ శాంతి ఆవశ్యకతను తెలియజేస్తున్నాయని అన్నారు. ఒకవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు మధ్యప్రాచ్య దేశాల్లో కొనసాగుతున్న ఘర్షణలు మానవాళిని ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. యుద్ధాల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు అనేక కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయని, అభివృద్ధి చెందిన నగరాలు సైతం శిథిలాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతుల శంకరయ్య, కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, శాంతి సంఘం రాష్ట్ర కార్యదర్శి జి. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సమత,జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య,పర్యావరణ పరిరక్షణ వేత్త శ్యామల నాగసేనారెడ్డి,మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, మైనారిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఏ.ఖాన్,ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చలం రంగారావు, సీనియర్ నాయకులు నేతి యాదగిరి, బుక్క ఈశ్వరయ్య, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, షరీఫుద్దీన్,కస్తాల వెంకన్న, తెలగమల దశరథ,బి. సప్న,ఇమాబిన్ తదితరులు పాల్గొన్నారు.

పూల పండుగకు శ్రీకారం..
ముస్తాబాద్‌లో ఎంలిగిపూల బతుకమ్మ సందడి !

*** తొలిరోజు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు..**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పూల పరిమళాలు.. జానపద గీతాల సవ్వడులు.. ఆడపడుచుల ఆటపాటల మధ్య తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలకు ముస్తాబాద్ మండలంలో శనివారం ఘనంగా జరిగాయి. పండుగలో తొలిరోజైన ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరీదేవిని పూజిస్తూ పండుగ శుభారంభం చేశారు. పల్లెల్లో పండుగ సందడి మొదలవడంతో తెలంగాణ సంప్రదాయాల వైభవం మరోసారి వెల్లివిరిసింది.

*** ప్రకృతిని పూజించే పూల పండుగ...**

బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన పండుగ.ప్రకృతిలో లభించే పూలను పేర్చి బతుకమ్మగా కొలవడం ఈ వేడుకలో ప్రధాన విశిష్టత. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అలంకరించి మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ వాటి చుట్టూ ఆడుతారు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటడంతోపాటు, మహిళల మధ్య ఐక్యతను పెంపొందించే వేడుకగా బతుకమ్మ నిలుస్తోంది.

*** తొమ్మిది రోజులూ ప్రత్యేకమే...**

ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన వేడుకలు తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో, ప్రత్యేక నైవేద్యాలతో కొనసాగుతాయి. ప్రతిరోజూ బతుకమ్మను అందంగా పేర్చి పూజలు నిర్వహించడం, సాయంత్రం వేళ మహిళలు ఒకచోట చేరి ఆటపాటలతో సంబురాలు చేసుకోవడం ఆనవాయితీ. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఈ వేడుకల్లో పాల్గొంటూ కుటుంబ బంధాలను, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తారు.

*** సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఆకర్షణ...**

తొమ్మిది రోజుల వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశేష ప్రాధాన్యం ఉంటుంది. ఈ రోజున మహిళలు పెద్ద బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థిస్తారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా సాగనంపుతారు. మహిళల సామూహిక ఆటపాటలు, జానపద గీతాలు ఈ వేడుకకు ప్రత్యేక శోభను తీసుకొస్తాయి.

*** భావితరాలకు సంస్కృతి వారసత్వం...**

బతుకమ్మ పండుగ కేవలం ఆచార వ్యవహారాలకు పరిమితం కాకుండా తెలంగాణ అస్తిత్వాన్ని, ఆడపడుచుల ఆత్మీయతను ప్రతిబింబిస్తుంది. ఆధునిక కాలంలోనూ యువత సంప్రదాయ పండుగల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా మన సంస్కృతి భావితరాలకు చేరుతుంది. పూల పండుగను పర్యావరణానికి మేలు చేసే విధంగా జరుపుకుంటూ, చెరువులు, నీటి వనరుల పరిశుభ్రతను కాపాడాలని పలువురు సూచిస్తున్నారు.ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ సంబురాలు సద్దుల బతుకమ్మ వరకు ముస్తాబాద్ మండలంలోని పల్లెల్లో పండుగ వాతావరణాన్ని నింపనున్నాయి. పూల సోయగాలు, భక్తిభావం, సంప్రదాయాల కలయికతో తెలంగాణ పండుగ వైభవం మరోసారి చాటిచెప్పనుంది.

ఠాగూర్స్ హైస్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనదని,ఇలాంటి పండుగలు విద్యార్థులలో నైతిక విలువలను, సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని ఠాగూర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్లోని ఠాగూర్స్ హైస్కూల్ లో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులలో హాజరై, విద్యార్థినిలు, ఉపాధ్యాయురాలు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బండారి సాయికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బండారి నెహా, డాక్టర్శాంతిభూషణ్,బిర్జుసింగ్, వెలుగు ఎడ్యూకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ ఇక్కుర్తి నారాయణ రావు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పాటతో మొదలైన నా ప్రయాణం..

సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. ''ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది'' అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజు షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిఫైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

బ్యూటీ

ముఖ సౌందర్యం కోసం..





కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.



ఫ్రీగా గెస్ట్ రోల్

పెళ్లి తర్వాత సినిమాలకు స్మాల్ గ్యాప్ ఇచ్చిన అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ ప్రస్తుతం తమిళంలో వెట్టువమ్ పేరుతో ఓ సినిమా చేస్తోంది. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియాడికల్ మూవీలో కమల్ హాసన్ తనయ శృతి హాసన్ ఓ గెస్ట్ రోల్ లో కనిపించబోతున్నట్లు సమాచారం. రెమ్యూనరేషన్ లేకుండా ఫ్రీగా శృతి హాసన్ ఈ సినిమా చేసినట్లు చెబుతోన్నారు. దుల్కర్ సల్మాన్‌తో కలిసి దాదాపు మూడు రోజులు షూటింగ్ కూడా చేసినట్లు చెబుతున్నారు. పా రంజిత్ చెప్పిన కథతో పాటు దర్శకుడిపై అభిమానంతో ఫ్రీగా ఈ మూవీలో నటించినట్లు చెబుతోన్నారు. ఆర్య, దినేష్, కలైయారసన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే వెట్టువమ్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



కరికాల యువరాణిగా

దాదాపు నాలుగేళ్ల తర్వాత హీరోయిన్‌గా తెలుగులో ఛాన్స్ దక్కించుకుంది గ్లామర్ బ్యూటీ కేథరిన్. సందీప్ కిషన్ హీరోగా శంబాల ఫేమ్ యుగంధర్ ముని దర్శకత్వంలో కరికాల పేరుతో అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా కన్ఫామ్ అయ్యింది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటిస్తూ మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో యువరాణి తరహా లుక్‌లో ఈ ముద్దుగుమ్మ కనిపిస్తోంది. చెవి దుద్దులతో పాటు చేతిపై మిణుగురు పురుగులు వాలి ఉండటం ఆసక్తిని పంచుతోంది. న్యూ బ్యూటీ...న్యూ మిస్టరీ అంటూ ఈ పోస్టర్‌కు మేకర్స్ క్యాప్షన్ జోడించారు. కరికాల సినిమాలో అతీంద్రియ శక్తులు కలిగిన యువరాణిగా విభిన్నంగా కేథరిన్ పాత్ర సాగనున్నట్లు సమాచారం.

నటుల్ని గౌరవించడం నేర్చుకో



- **నెటిజన్ కామెంట్‌పై ఆది రియాక్ట్**

యూట్యూబర్‌కు ఉన్న మార్కెట్ నీకు లేదంటూ ఓ నెటిజన్ చేసిన విమర్శలపై టాలీవుడ్ హీరో ఆది సాయి కుమార్ రియాక్ట్ అయ్యాడు. యూట్యూబర్‌కు ఉన్న మార్కెట్ నీకు లేదంటూ ఓ నెటిజన్ ట్రోల్ చేశాడు. దీనిపై ఆది స్పందించాడు. ప్రతి నటుడి కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. సక్సెస్ ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా వారి జర్నీని గౌరవించాలి. మా నాన్నతో రవితేజ లాంటి వారు ఈజీగా పైకి రాలేదు. అవకాశాల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కష్టాలు ఎదురైనంత మాత్రానా కెరీర్ ముగిసినట్లు కాదు. నెగెటివ్ కామెంట్లతో వారిని మరింత కిందకు లాగే బదులు ప్రోత్సహిస్తే మంచిది. ప్రతి నటుడి జర్నీని గౌరవించడం నేర్చుకోండి" అంటూ బదులిచ్చాడు.

బ్లడీ రోమియోతో రొమాన్స



ది ప్యారడైజ్ తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండా వెంటనే తన నెక్స్ట్ సినిమాను మొదలుపెట్టబోతున్నారు నాని. సుజీత్ దర్శకత్వంలో బ్లడీ రోమియో పేరుతో ఓ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ మూవీ చేస్తోన్నాడు. నానికి జోడీగా ఇద్దరూ హీరోయిన్లు నటించనున్నారట. ఓ హీరోయిన్‌గా మలయాళ బ్యూటీ ప్రీతి ముకుందన్ ఫైనల్ అయ్యింది. మరో నాయికగా మృణాల్ ఠాకూర్ పేరు ప్రచారం జరుగుతోంది. మేకర్స్ శనివారం ఓ ట్వీట్ పెట్టారు. ఈ సినిమా సెట్స్‌పైకి రాబోతున్నట్లు హింట్ ఇచ్చారు. ప్రవీణ్ లక్కరాజు మ్యూజిక్ అందించబోతున్నారు. ఈనెల 17 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కాబోతున్నట్లు సమాచారం.

గ్రామీ అవార్డ్స్ రేసులో ధురంధర్-2



బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ ధురంధర్ 2 గ్రామీ రేసులో నిలవబోతుంది. 2027లో జరుగనున్న గ్రామీ అవార్డుల కోసం తొమ్మిది విభాగాల్లో ధురంధర్ 2ను పరిశీలనకు పంపించినట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. శశ్వాత్ సచ్‌దేవ్ సంగీతం అందించిన ఈ సినిమా మొత్తం ఆల్బమ్‌తో పాటు బెస్ట్ సాంగ్ రిటన్ ఫర్ విజువల్ మీడియా, బెస్ట్ ఏషియన్ పాప్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ , బెస్ట్ రాప్ పెర్ఫార్మెన్స్ మరో ఐదు విభాగాల్లో పోటీ కోసం పంపించారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ నామినేషన్స్‌పై క్లారిటీ రాబోతుంది. ఫిబ్రవరి ఫస్ట్ వీక్‌లో గ్రామీ అవార్డుల వేడుక జరుగనుంది. ఎన్ని విభాగాల్లో తుది నామినేషన్‌కు ఈ సినిమా ఎంపికవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు స్లమ్ డాగ్ మిలియనీర్ మాత్రమే గ్రామీ అవార్డులను అందుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.